క్లుప్తంగా

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



ఆక్రమణ స్థలంలో బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

గుర్ల: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ వి.నారాయణమ్మ అన్నారు. మండలంలోని కెల్ల గెడ్డలో కెల్ల గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆక్రమించడడంతో రెవెన్యూ అధికారులు మంగళవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కెల్ల రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 332 పరిధిలోని ప్రభుత్వ భూమిలో సుమారుగా 30 సెంట్లు జేసీబీతో చదును చేసి ఆక్రమించారు. రెవెన్యూ అధికారులకు సమాచారం రావడంతో ఆక్రమణ స్థలంలో బోర్డును వీఆర్వో రఘు ఏర్పాటు చేశారు.

విత్తనాల పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చేతులమీదుగా రైతులకు వరి విత్తనాలు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధికారులు అలసత్వం వహించకుండా రైతులకు సకాలంలో విత్తనాలు అందివ్వాలని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, మండల వ్యవసాధికారి రవీంద్ర, ఎంపీటీసీ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లతో గ్రామస్తులు

శృంగవరపుకోట: జామి మండలంలోని పావాడ గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలని పిలుపునిస్తూ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను గ్రామస్తులతో కలిసి ప్రజాకవి ఆతవ ఉదయభాస్కర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 22న ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అంబేడ్కర్ వాదులు, పౌరహక్కుల నేతలు హాజరవుతున్నారని, ప్రతిఒక్కరూ కార్యక్రమానికి హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

యోగాతోనే ఆరోగ్యం



చీపురుపల్లి: యోగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం యోగా కార్యక్రమాలు నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు సీనియర్ సిటిజన్‌లకు, దివ్యాంగులకు యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పలువురు మాట్లాడుతూ యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాలిన గాయాలపై పసుపు, సిరా రాయొద్దు



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు ముద్దాడ శ్రావణి

విజయనగరం ఫోర్ట్: కాలిన గాయాలపై పసుపు, సిరా వేయవద్దని, అలా వేస్తే చర్మం తన సహజ గుణాన్ని కోల్పోతుందని ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ముద్దాడ శ్రావణి తెలిపారు. స్థానిక దాసన్నపేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గ్రామీణ వైద్యులకు వైద్య విజ్ఞానంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలిన గాయాలపై మంట తగ్గేవరకు చల్లని నీరు పోయాలని తెలిపారు. ఆ తర్వాత దగ్గరలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి, చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జోషి, కార్యదర్శి గద్దె చిరంజీవి, జిల్లా అధ్యక్షులు కోట్ల పైడిరాజు, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో..
ప్రజలకు మోసం!

• వెన్నుపోటు పుస్తకావిష్కరణలో వైఎస్సార్ సీపీ నాయకులు



గజపతినగరం రూరల్: వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



శృంగవరపుకోట: జామిలో వెన్నుపోటు పుస్తకావిష్కరణలో వైఎస్సార్ సీపీ నేతలు



బొండపల్లి: విడుదల చేసిన వెన్నుపోటు పుస్తకాన్ని చూపిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వేపాడ: వెన్నుపోటు పుస్తకం విడుదల చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ అప్పారావు తదితరులు



దత్తిరాజేరు: వెన్నుపోటు పుస్తకాన్ని విడుదల చేస్తున్న పార్టీ నాయకులు



కూటమి ఏడాది పాలన వైఫల్యాలపై పుస్తకం విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గంట్యాడ: వెన్నుపోటు పుస్తకాన్ని విడుదల చేస్తున్న ఎంపీపీ హైమావతి, జెడ్పీటీసీ నరసింహమూర్తి

గజపతినగరం రూరల్: కూటమి పాలన అంతా మోసమేనని..అధికారంలోకి వస్తే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఏడాదైనా వాగ్దానాలేవీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు మాస్టారు విమర్శించారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కూటమి పాలనలో ప్రజలకు జరిగిన మోసంపై రూపొందించిన వెన్నుపోటు పుస్తకాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి ప్రజలకు అనేక హామీలిచ్చాయని, వాటి అమలులో మాత్రం ఘోరవైఫల్యం చెందాయన్నారు. ఏడాది పాలనలో కనీసం ఒక్క పథకమూ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఏడాదికి నాలుగు గ్యాస్‌బండలు అని మొదట చెప్పి, ఇప్పుడేమో మూడు ఇస్తున్నారని, మొదటి ఏడాది గ్యాస్‌బండలు కూడా ఎగ్గొట్టారని మండిపడ్డారు. ఇప్పుడేమో తల్లికి వందనం అందరికీ అని చెప్పి, కొందరికే ఇచ్చారని ధ్వజమెత్తారు. కూటమి నాయకులకు అధికార దాహం తప్ప ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన లేదన్నారు. అయితే ప్రజలకు మంచి జరిగేంత వరకు వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నారు. ప్రతిక్షణం ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసి, కేసులు, దాడులకు దిగుతుండడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ తప్పుడు విధానాలను ప్రశ్నించే ఎంతో మంది సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కూటమి గద్దెనెక్కిన దగ్గరి నుంచి అశాంతి, అరాచకం, అక్రమాలు, అవినీతే రాజ్యమేలుతున్నాయన్నారు. ఇదంతా గమనిస్తున్న ప్రజలు గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును గుర్తుకు తెచ్చుకుంటున్నారన్నారు. జగనన్న ఇచ్చిన ప్రతి హామీని తూ.చ తప్పకుండా అమలు చేశారని, సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసి మరీ చెప్పిన తేదీకి చెప్పిన పథకం ఇచ్చారని చెప్పుకుంటున్నారన్నారు. ప్రజలకు న్యాయం జరిగేంత వరకు వైఎస్సార్ సీపీ పోరాడుతూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు బి.త్రినాథరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, మధుపాడ సర్పంచ్ కె.పైడపునాయుడు, గజపతినగరం వైస్ ప్రెసిడెంట్ కె.రామునాయుడు, నానాజి పాల్గొన్నారు.

చంద్రబాబు అంటే అరాచకం..

వేపాడ: అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను నమ్మిస్తూ కాలయాపన చేస్తున్నారని మండల వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు ప్రభుత్వాన్ని విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వెన్నుపోటు పుస్తకం మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలుచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జగన్ అంటే శాంతి, సుస్థిరత, పటిష్టం, పటిష్ట లా అండ్ ఆర్డర్, నిబద్ధత సంకల్పం, సంక్షేమం, సమగ్రాభివృద్ధి, గ్రామస్వరాజ్యం, ఇంటింటి సేవలు అని.. చంద్రబాబు అంటే అశాంతి, అరాచకం, ఆటవిక పాలన క్షీణించిన లా అండ్ ఆర్డర్, రాజ్యాంగ ఉల్లంఘన, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, వేధింపులు, అక్రమాలు, అన్యాయాలు అని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఎస్.వెంకటరావు ఎంపీటీసీ టీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: జామి మండల కేంద్రంలో కూటమి ఏడాది పాలనపై రూపొందించిన వెన్నుపోటు పుస్తకాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, పాండ్రంకి సంజీవి మంగళవారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలన అంతా మోసమేనని, భీమసింగి చక్కెర కర్మాగారాన్ని తెరుస్తామన్న మంత్రి హామీ గాలికి పోయిందని విమర్శించారు. జామిలో 2,500 అగ్రహారం భూముల సమస్య.. పరిష్కారానికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు పి.సంజీవి, పార్టీ మేధావుల ఫోరం కార్యదర్శి సీహెచ్ సత్యారావు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఫణిబాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎ.అవినాష్, ఎంపీపీ ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: మోసం, వెన్నుపోటులకు సీఎం చంద్రబాబు గురువు లాంటివారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున విమర్శించారు. దత్తిరాజేరు మాజీ సర్పంచ్ ఫణీంద్రుడు ఇంటి వద్ద వెన్నుపోటు పుస్తకాన్ని ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు కలిసి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దన్నాన త్రినాథ, రామచంద్రరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో కూలమి ప్రభుత్వ ఏడాది పాలనపై రూపొందించిన వెన్నుపోటు పుస్తకాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, ఎంపీపీ చల్లా చలంనాయుడు మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్‌గా చంద్రబాబు నిలుస్తున్నారని, ప్రతిసారి ఆయనను నమ్మి ప్రజలు మోసపోతూనే ఉన్నారన్నారు. ఆయనెప్పుడూ ఇచ్చిన హామీలు నిలబెట్టుకునే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మహంతి రమణ, తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అధికారంలోకి రాగానే గాలికి వదిలేసి బాబూ ష్యూరిటీ మోసం గ్యారంటీ అని మరోసారి నిరూపించారని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఎస్.వి.రమణరాజు, తాడ్డివే ఋగోపాల్‌రావు, కోట్ల విశ్వేశ్వరరావు అన్నారు. మెరకముడిదాం గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిగా సంక్షేమ పథకాలపై ప్రజలకు చేస్తున్న మోసంపై పార్టీ ముద్రించిన జగన్ అంటే నమ్మకం - చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని నాయకులు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినప్పటికీ కూటమి నాయకులు సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పోలీసు అధికారులను పావులుగా వాడుకొని రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న సాక్షి దినపత్రికపైన, అందులో పని చేస్తున్న జర్నలిస్టులపైనా కక్ష సాధింపులకు దిగడం సరికాదన్నారు. అధికారం ఏ పార్టీకి శాశ్వతం కాదని ఐదేళ్లకొకసారి మారుతుందన్న విషయాన్ని కూటమి నాయకులు గుర్తుంచుకుంటే మంచిదని హితవు పలికారు. కూటమి పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాలు హామీలను అమలు చేయాలని లేకుంటే తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి.హరిబాబు, పప్పల కృష్ణమూర్తి, కుచ్చర్లపాటి గుర్రాజు, పల్లి కృష్ణమూర్తి, మండల సత్యనారాయణ, సారిక తమ్మినాయుడు, అట్టాడ దేవా, కొమ్ము శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ: మోసానికి మారుపేరు చంద్రబాబు అని ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి విమర్శించారు. మండలంలోని రామవరం గ్రామంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనా వైఫల్యాలపై వెన్నుపోటు పుస్తకాన్ని వారు మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా దగా, అవినీతి, మోసమేనని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు పాల్గొన్నారు.

కొత్తబగ్గాంలో 'పొలం పిలుస్తోంది'

గజపతినగరం: కౌలురైతు కార్డులు కలిగి ఉన్న రైతులంతా అన్నిరకాలుగా ప్రభుత్వ ప్రయోజనాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.మహరాజన్ తెలిపారు. మండలంలోని కొత్తబగ్గాం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని, రైతులకు పలు సూచనలు చేశారు. కౌలురైతు పత్రాలు ఉన్న రైతులంతా భూ యజమానితో సమానంగా రాయితీపై విత్తనాలు పొందవచ్చన్నారు. పంటనష్టం వాటిల్లినట్లతే ప్రభుత్వం ఇచ్చే సొమ్ము కౌలురైతుకే వస్తుందన్నారు. పండిన పంటను కౌలురైతు తన పేరు మీదనే ప్రభుత్వానికి అమ్మి మద్దతు ధర పొందవచ్చన్నారు. అలాగే బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం పొందే అవకాశం ఉందన్నారు. వరిలో 1121 రకానికి బదులుగా సాగునీటి సదుపాయం ఉన్న గ్రామాల్లో రైతులు 1318 రకం వేస్తే మంచి దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం కౌలురైతులకు సీసీఆర్‌సీ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.కిరణ్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారిణి కీర్తి తదితరులు పాల్గొన్నారు.



కౌలురైతులకు సీసీఆర్‌సీ పత్రాలు అందజేస్తున్న ఏడీఏ మహరాజన్

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



గజపతినగరం: తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తమకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అంగన్‌వాడీలు పోరుబాట పట్టారు. గత రెండు మూడు రోజులుగా ఎక్కడపడితే అక్కడ ఆందోళనలు చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం తల్లికి వందనం పథకం డబ్బులు తల్లుల ఖాతాల్లో వేయగా, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ ప్రభుత్వం వారికి తల్లికి వందనం పథకం అందివ్వలేదు. దీంతో ప్రభుత్వం తీరుపై అటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇటు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మండిపడుతున్నారు. చిరుద్యోగులమైన తమపై ఎందుకింత నిర్లక్ష్యం, చాలీచాలనీ జీతాలతో ఉద్యోగాలు చేస్తున్నామని, తమకు కూడా పథకాలు దూరం చేస్తే ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అన్ని ప్రభుత్వ పథకాలు తమకు ఇవ్వాలని కోరారు. మంగళవారం ఇలా తహసీల్దారు కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శించారు. –గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు



దత్తిరాజేరు: సంక్షేమ పథకాలు అందివ్వాలని కోరుతున్న అంగన్‌వాడీ సిబ్బంది



బొండపల్లి: ప్రభుత్వ తీరును నిరసిస్తూ తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నినాదాలు

20న మండల సర్వసభ్య సమావేశం

వేపాడ: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులంతా వస్తున్నారని, అధికారులు కూడా హాజరు కావాలని కోరారు.

డీలర్స్‌తో సమావేశం

గజపతినగరం: స్థానిక రైతు సేవా కేంద్రంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులపై సంబంధిత డీలర్స్‌తో మండల ఏవో పి.కిరణ్‌కుమార్ మంగళవారం సమావేశమై పలు సూచనలు చేశారు. డీలర్స్ అంతా విత్తనాలు తెచ్చే కంపెనీ లైసెన్స్‌లో జత అయిందా లేదా అని చూసుకోవాలన్నారు. మొలక పరీక్షలు, స్టాక్ రిజిస్టర్‌లో నమోదు, ధరలు, పట్టికలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు.

రైతుల ఆందోళన



దత్తిరాజేరు మండలం, పెదమానాపురం జాతీయ రహదారిలోని టోల్‌గేటు వద్ద రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. నిమ్మాది కట్టచానల్ నుంచి రాతి చెరువుకు నీరు వస్తున్న కాలువను పూడ్చి, టోల్‌గేటు పనులు చేస్తుండడాన్ని రైతులు వ్యతిరేకించారు. గతేడాది ఇలాగే చేయడం వల్ల పంటపొలాలకు సాగునీరందక ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి..జేఈ సురేష్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతులకు నష్టం చేసే పనులు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. విశాఖపట్నంలో యోగాంధ్ర కార్యక్రమ విధుల్లో ఉన్నానని, సోమవారం వచ్చి పరిశీలిస్తానని సమాధానమిచ్చారు. అంతవరకు పనులు ఆపాలని చెప్పి అక్కడి నుంచి జెడ్పీటీసీ, రైతులు వెళ్లిపోయారు. –దత్తిరాజేరు


రెవెన్యూ అధికారుల తీరుపై దళితుల ఆగ్రహం



హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు వచ్చిన రెవెన్యూ అధికారులను నిలదీస్తున్న బాధిత దళితులు

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు గ్రామంలోని 12 మంది దళిత కుటుంబాలకు చెందిన భూమిని కూటమి నాయకులు ఆక్రమించుకుంటుంటే బాధిత దళిత కుటుంబాలు వారు అడ్డుకుంటున్న విషయం పాఠకులకు తెలిసిందే. అయితే సదరు భూమిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి సన్యాసిరావు, వీఆర్వో టి.పూర్ణమ, విలేజ్ సర్వేయరుతో కలిసి ఈ భూమి ప్రభుత్వ భూమి అని.. ఆక్రమణదారులు శిక్షార్హులని బోర్డుల ఏర్పాటుకు మంగళవారం సిద్ధమయ్యారు. దీంతో బాధిత దళిత కుటుంబాల వారు అధికారుల బోర్డుల ఏర్పాటు చర్యలను అడ్డుకున్నారు. వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమికి రక్షణ కల్పించండి మహాప్రభో అని వేడుకుంటే ఈ భూమి ప్రభుత్వ భూమి అని చెప్పి ఆక్రమణదారులు శిక్షార్హులని బోర్డు పెట్టడం ఏంటని నిలదీశారు. కూటమి నాయకుల ఆదేశాల మేరకే ఈ పని చేస్తున్నారని, రెవెన్యూ రికార్డులు, నిబంధనలు పక్కన పెట్టేశారని వారు విమర్శించారు. సర్వే నంబరు 255-24లో ఎకరా 98 సెంట్లు, 254-1లో 0.62 సెంట్లు భూమిని తమ తాతల నాటి దగ్గర నుంచి సాగు చేస్తున్నామన్నారు. గతంలో పట్టాలు సైతం వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ భూమి ప్రభుత్వ భూమి అని అధికారులు బోర్డులు ఏర్పాటు చేయడం వెనక ఏమిటి ఉద్దేశమని ప్రశ్నించారు. బోర్డులు ఏర్పాటు చేస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. సదరు భూమికి సంబంధించి 40 ఏళ్ల క్రితం పట్టాలు సైతం జారీ అయ్యాయని, భూ అభివృద్ధికి ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేసినుయ్యి కూడా తవ్వారని గుర్తుచేశారు. అప్పటి నుంచి తమ అనుభవంలోనే ఉందన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసి 1బి..లు జారీ చేయాలని ఇప్పటికే మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. భూముల ఆక్రమణకు సంబంధించి తహసీల్దారు క్షేత్రస్థాయిలోకి వచ్చి విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

మహాసభలను విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

గంట్యాడ: జిల్లా అంతటా జూలై 26, 27వ తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. మండలంలోని నరవ గ్రామంలో మహాసభలకు సంబంధించి, రూపొందించిన కరపత్రాలు మంగళవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబరు 26వ తేదీన కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందని, అప్పటి నుంచి ప్రజా ఉద్యమంలో ఎన్నో మైలురాళ్లు చేరుకుందన్నారు. రైతులు, బడుగు, బలహీన వర్గాలు, మహిళలు, కార్మికులు ఇలా అందరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిరంతరం పోరాటం చేస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.